కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం నూతన్‌కల్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్ చందు తెలిపారు. నూతన్‌కల్ గ్రామ పరిధిలోని అగ్రికల్చర్, పరిశ్రమల సర్వీసులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని ఎస్సీ కాలనీలో అనారోగ్య కారణంగా మృతిచెందిన నరసింహారావు మృతదేహాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబమైన నర్సింహరావు అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నేత అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి 'అడ్డా' కూలీలు

- భైకు ఉన్న వారికి పెట్రోల్‌కు రూ.200
- అదనంగా టిఫిన్లు, బిర్యానీ, మందు

ఎన్నికల ప్రచారంలో రోజుకు రూ.వెయ్యి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ పర్వం కొనసాగుతుండటంతో రాజకీయ సందడి మొదలైంది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ గెలుపు కోసం పోటాపోటీగా ప్రచారంలో జోరు పెంచాయి. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. విభిన్న ప్రచార వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల వేట కోసం పడరాని పాట్లు పడుతున్నారు. శివారు జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లోని డివిజన్లు, వార్డులు, బస్తీల్లో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారానికి 'అడ్డా' కూలీలను వినియోగించుకుంటున్నారు. దీంతో వారికి ఎన్నికల గిరాకీ పెరిగింది. నగర శివారుల్లో వివిధ పనుల కోసం దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలలోని పలు జిల్లాల నుంచి వలస వచ్చిన వందలాది మంది కూలీలు నివాసముంటున్నారు. వీరంతా నగరంతోపాటు శివారుల్లో భవన నిర్మాణ రంగంలో వివిధ పనుల కోసం వెళ్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రచార కార్యక్రమం ఊపందుకోవడంతో.. ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిరోజూ ఎన్నికల ప్రచార కార్యక్రమంతో సహా ఎన్నికల ప్రచార రథం వెంట వెళ్లటానికి అడ్డా కూలీలను వియోగించుకుంటున్నారు. నగరంతో సహా శివారుల్లో కూలీల అడ్డాలు కూడా పదుల సంఖ్యలో ఉండటంతో.. పార్టీల అభ్యర్థులకు మరింత కలసి వస్తోంది. పలువురు అభ్యర్థులు.. వారి అనుచరులను అడ్డాల వద్దకు పంపించి కూలీల పేర్లు, వారి ఫోన్ నంబర్లు సేకరించటంతో పాటు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారా.. లేదా అనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే.. కూలీ డబ్బులతో పాటు బైకు ఉంటే.. పెట్రోల్, భోజనం, రాత్రి వరకు ప్రచారంలో పాల్గొంటే.. మద్యం వంటి సదుపాయం కల్పిస్తామని ఆఫర్ చేస్తున్నారు. దీంతో ఐదారు రోజులుగా అడ్డాల వద్దకు వెళ్తే కూలీలు దొరకడం లేదని పలువురు బిల్డర్లతో సహా ఇళ్లు నిర్మించుకుంటున్న యజమానులు వాపోతున్నారు.

ప్రతిరోజూ రూ.వెయ్యి.. అదనపు వసతులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అడ్డా కూలికి ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు రోజుకు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ప్రచారంలో పాల్గొనే వారికి బైకు ఉంటే రూ.200 పెట్రోలు పోయిస్తున్నారు. ఉదయం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే.. కూలీ డబ్బులతో పాటు టిఫిన్లు కూడా పెడుతున్నారు. అలాగే, మధ్యాహ్నం పూట అయితే.. బిర్యానీ లేదా భోజనం పెడుతున్నారు. రాత్రి వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే మాత్రం క్వార్టర్ మద్యం బాటిల్ ఇస్తున్నారు. ఎన్నికల పుణ్యమా అని కూలీ డబ్బులతోపాటు ఇతర వసతులు దొరకటంతో.. చాలామంది అడ్డా కూలీలు పనులు మాని వేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

మేడ్చల్ జిల్లాలో 13 నామినేషన్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మంగళవారం 13 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరు నామినేషన్లు, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండేసి చొప్పున ఆరు నామినేషన్లు దాఖలైనట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ సంబంధిత ఆర్వోలు స్వీకరించారని పేర్కొన్నారు.

సేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భేష్



మాట్లాడుతున్న మాధవరెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు అనే వలంటీర్ ట్రైనింగ్ వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన వందేమాతరం ఫౌండేషన్ కన్వీనర్ మాధవరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలకమన్నారు. స్కూళ్లలో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి చదువు భోధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శైలజ, జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్లు జగన్, మల్లిక, హాలియా, రచన, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేరకు ఈవీఎంలను సర్దుబాటు చేయాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ నెల 18న రెండో దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఎన్నికల పరిశీలకులు, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్రస్థాయి, ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ శబరీష్ కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు.

- ఎన్నికల తనిఖీలలో నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈఎస్ఎంఎస్ యాప్‌లో వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలన్నారు.
- జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
- సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి.. నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు.
- పోస్టల్ బ్యాలెట్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ఎంసీపల్లి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ



ఎంసీపల్లి పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి

శామీర్‌పేట్: అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి అన్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణ పద్ధతులను అనుసరించాలని వైద్యులకు సూచించారు. ప్రజల హెల్త్ కేర్ విషయంలో ప్రోత్సహించడం ద్వారా మెరుగైన ఆరోగ్య ఫలితాలను పొందుతారని, ఆ దిశగా కృషిచేయాలన్నారు. మండల వైద్యాధికారి దమయంతి, కౌశిక్, స్థానిక సర్పంచ్ జాం రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సోదరభావంతో చూడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను సోదరభావంతో చూడాలని లోటస్ ల్యాప్ పబ్లిక్‌స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం షీ టీమ్ వారిచే నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో, బయట ఆడ పిల్లలతో ఎలా ప్రవర్తించాలి, వారితో ఎలా మర్యాదగా నడుచుకోవాలో వివరించారు. అసభ్యకరంగా మాట్లాడరాదని, ప్రేమతో, సోదరభావంతో మెలగాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండకుండా యువతీ యువకులు వాహనాలు నడపరాదని, ఒక వేళ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. సెల్‌ఫోన్ వాడకం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో షీ టీం ఇన్‌స్పెక్టర్ ఆర్.కమలాబాయి, ట్రాఫిక్ ఎస్సై యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సభకు బీజేపీ నేతలు



భోగారం నుంచి సభకు వెళ్తున్న బీజేపీ నేతలు

కీసర: నగరంలోని ఎల్బీస్టేడియంలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి సభకు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బీజేపీ సీనియర్ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోల బాల్‌రాజ్, బాపిరెడ్డి, దేశం మల్లేష్‌యాదవ్, కేశవ రెడ్డి, కందాడి సత్తిరెడ్డి, వేణుగోపాల్, గాలి సంపత్‌యాదవ్, నల్ల వెంకట్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, బండారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు సభకు తరలివెళ్లిన వారిలోఉన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఈ నెల 11న జరిగే మహాసభ విజయవంతం కోసం సన్నాహక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఏ పార్టీ గెలిచినా ఓడినా మాదిగలకు ఒరిగేది ఏమీ లేదని రిజర్వేషన్ల వర్గీకరణతోనే అభివృద్ధి అవుతామన్నారు. విశ్వరూప మహాసభకు మాదిగలు, మాదిగ ఉపకులాలు లక్షలాదిగా తరలిరావాలని కోరారు.

కరపత్రాల పంపిణీ..

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు.

వాహన తనిఖీల్లో రూ.5 లక్షలు స్వాధీనం

మేడ్చల్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మేడ్చల్‌లో వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్‌వోటీ పోలీసులు తనిఖీల్లో భాగంగా రూ.5 లక్షలు పట్టుకున్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు అందులో భాగంగా మేడ్చల్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి కారులో రూ.5 లక్షలు లభ్యం కావడంతో సరైన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు నగదు సీజ్ చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

మల్కాజిగిరి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వృద్ధులు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరా నెహ్రూనగర్‌కు చెందిన పాల్ అలియాస్ అంజయ్య(55) గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

దయానంద్‌నగర్‌కు చెందిన హెరాల్డ్ విక్టోరియా(55)కు మానసిక స్థితి బాగాలేదు. ఈ నెల 5వ తేదీన మల్లికార్జుననగర్‌లో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం ఆమె కనిపించకపోవడంతో విక్టోరియా భర్త జాన్సన్‌కు సమాచారం అందించింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఎజెండాతోనే పార్టీలు ముందుకు రావాలి

డీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ



జవహర్‌నగర్‌లో మాట్లాడుతున్న డీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ

జవహర్‌నగర్: పేదల ఎజెండాతోనే రాజకీయ పార్టీలు ముందుకు రావాలని దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌లోని డీఎస్ఎస్ కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల హామీల అంశాలపై డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ పాలకుల నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాల్సిన రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద ప్రజల హక్కుల కోసం ఓటు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరికీ అందించారని, 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పకుండా ఓటును వినియోగించుకుని మంచి పరిపాలన అందించే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల్లో ధన ప్రవాహంతో ఓటును కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో హామీలు అమలు కాక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరుడు క్రిష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్ల పద్మారావుముదిరాజ్, జిల్లా నాయకులు అందె నరేందర్, నాగేష్ రజక, కొండ స్వామి, శశిరేఖ, రూనీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

10న చెస్ పోటీలకు ఎంపిక

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లా అండర్-14, 17 చెస్ ఛాంపియన్‌షిప్ ఎంపికలు బోడుప్పల్‌లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 10వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, స్పాట్‌లో ఆడేందుకు అవకాశం లేదన్నారు. క్రీడాకారులు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు రిపోర్ట్ చేయాలని, స్కూల్ నుంచి ఒక్కో అంశంలో ఇద్దరికీ మాత్రమే పాల్గొనే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు మధ్యాహ్న భోజనం, సొంత చెస్ సెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విద్యార్థులు డిక్లరేషన్ ఫామ్, క్రీడాకారులు అర్హత ఫామ్‌తో పాటు స్కూల్ సంబంధ సర్టిఫికేట్లు వెంట తీసుకురావాలన్నారు. ఫోన్: 94261 51111, 83744 61481.

మల్లారెడ్డి యూనివర్సిటీలో వాతావరణ కేంద్రం ప్రారంభం



వాతావరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరత్న, యూనివర్సిటీ వీసీ, డీన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో స్వయంచలిత వాతావరణ కేంద్రాన్ని ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్, అగ్రోనమి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాతావరణ కేంద్రాన్ని భారత వాతావరణ శాఖ హైదరాబాద్ డైరెక్టర్ నాగరత్న, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరత్న మాట్లాడుతూ వాతావరణ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల కేంద్రం నుంచి అందించే సమాచారం రైతులకు, కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల పరిశోధనలకు దోహదపడుతుందన్నారు. శాస్త్రవేత్తలు రాధాకృష్ణన్, రవీందర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో కనీస విలువ లేదు

- కాంగ్రెస్‌లో చేరిన ఎల్లంపేట్ సర్పంచ్, ఎంపీటీసీ
- వజ్రేష్ యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం



కాంగ్రెస్‌లో చేరిన వారితో సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, అజయ్‌యాదవ్

మేడ్చల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు ఎల్లంపేట్, సోమారం, సైదనిగడ్డతండా ఎంపీటీసీ సభ్యుడు కుమార్‌యాదవ్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు నాయకులు గుడ్ బై చెప్పి తమ అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో మంత్రి మల్లారెడ్డి నాయకులకు, కార్యకర్తలకు కనీసం విలువ ఇవ్వడం లేదని అందుకే పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్యామ్, నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్, సురేష్, మోహన్, శ్రీనివాస్, పాండు తదితరులు ఉన్నారు. బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్‌యాదవ్, నూతన్‌కల్ ఎంపీటీసీ ఆశ సుల్తానా, అక్రంపాషా తదితరులు ఉన్నారు.

గుండ్లపోచంపల్లిలో ప్రచారం..

మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు, కుమార్తె గుండ్లపోచంపల్లిలో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ నిర్వహించిన ప్రచారంలో వజ్రేష్‌యాదవ్ కోడలు డాక్టర్ స్పందన, కూతురు సరిత పట్టణ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

జవహర్‌నగర్: అమలుకాని హామీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సారి హస్తం గుర్తుకు ఓటు వేసి మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్(జంగయ్య)యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని జవహర్‌నగర్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ కోరారు. జవహర్‌నగర్‌లోని పలు డివిజన్లలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఒక్కసారి అధికారం ఇచ్చి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు మల్లేష్‌చారి, చంద్రశేఖర్, భాస్కర్‌గౌడ్, సతీష్, నరేష్, అశోక్, సుధ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

ఘట్‌కేసర్: పేదలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన మంత్రి మల్లారెడ్డిని మేడ్చల్ నియోజకవర్గం నుంచి పారదోలాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 11వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం, చేరికలు కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై కండువాలు కప్పి పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్ఎఫ్‌సీనగర్ మూడో వార్డులో టీ పీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కౌన్సిలర్ సంగీతతో కలిసి కాంగ్రెస్ కార్యలయాన్ని ప్రారంభించారు.



గుండ్లపోచంపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు, వజ్రేష్‌యాదవ్ కుటుంబసభ్యులు



జవహర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నిహారికగౌడ్



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి

ఓట్లు దండిగా వేయండి.. కానీ ప్రలోభాలకు లొంగవద్దు



ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌లో సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న పలువురు వక్తలు

ఉప్పల్: ఓట్లు దండిగా వేయండి.. కానీ ప్రలోభాలకు లొంగకండి అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు.. ఈ ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందని, డబ్బు పరవళ్లు తొక్కుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులంతా చెడ్డవారు కాదని, మంచి వారు కూడా ఉన్నారని.. వారిని గుర్తించి సమాజానికి సేవ చేసే వారికి ఓటు వేయాలని సూచించారు. ఉప్పల్ ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది యువకులు ఓటు నమోదు చేసుకున్నారని, వీరే సరైన నిర్ణేతలన్నారు. ఓటు వేసే విషయంలో గ్రామాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ శాతం నమోదైతే పట్టణ ప్రాంతాల్లో 60 శాతం దాటడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ రోజు సెలవు ఉండటం వల్ల ఐటీ ఉద్యోగులు ఓటు వేయడంలో బద్ధకిస్తున్నట్లు పరిశీలకులు చెబుతున్నారని, వారు కూడా తప్పని సరిగా ఓటు వేయాలని, వేయించాలని కోరారు. అభ్యర్థి నచ్చకపోతే నోటాకు ఓటు వేయాలన్నారు. ఓటు వినియోగించుకుంటామని, ప్రలోభాలకు లొంగమని ప్రతిజ్ఞ చేయించారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధులు పద్మనాభరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, విశ్రాంత డీజీపీ గోపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రామలింగారెడ్డి, మన్నె నర్సింహా రెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇఫ్లూ విద్యార్థుల హంగర్ స్ట్రైక్

ఉస్మానియా యూనివర్సిటీ: ఇఫ్లూ విద్యార్థులు హంగర్ స్ట్రైక్ చేపట్టారు. ఈ నెల 6వ తేదీ రాత్రి నుంచి యూనివర్సిటీ ప్రవేశ ద్వారం వద్ద దీక్షలు చేపట్టారు. గత నెల 18న లైంగిక వేధింపులకు గురైన పీజీ విద్యార్థినికి న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగాల పేర్లతో మోసం

రాంగోపాల్‌పేట్: హైకోర్టు, పోస్టల్ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ.13.5 లక్షలు మోసం చేసిన వ్యక్తిని మార్కెట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. శివాజీనగర్‌లోని డొక్కలమ్మ దేవాలయం ప్రాంతంలో అనిత అనే మహిళ తన ముగ్గురు కుమారులతో కలిసి ఉంటుంది. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి ద్వారా అల్కాపురిలో నివాసముండే నాగరాజు అనే వ్యక్తి ఐదేళ్ల క్రితం పరిచయమయ్యాడు. నాగరాజు ఎల్‌బీనగర్‌లో ధనలక్ష్మి మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను నడిపిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నాడు. అనిత ముగ్గురు కుమారులకు పోస్టల్ లేదా హైకోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నాగరాజు నమ్మించాడు. ఆయన మాటలు నమ్మిన ఆమె విడతల వారీగా రూ.13.50 లక్షలు ఇచ్చింది. అప్పటి నుంచి రేపు, ఎల్లుండి అంటూ కాలం వెళ్లబుచ్చుతూ వస్తున్న ఆయన ఉద్యోగాలు ఇప్పించకపోగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆమె మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సౌకర్యార్థమని నిర్మించారు.. నిరుపయోగంగా మార్చారు!

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి సంఘాల కోసం నిర్మించిన విద్యార్థి చర్చ వేదిక భవనం (స్టూడెంట్ డిస్కోర్స్ సెంటర్) నిరుపయోగంగా మారుతోంది. ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల సభలు, సమావేశాలు, ఆందోళనలు, ఇతర కార్యక్రమాలపై నిషేధం విధించిన వీసీ ప్రొ.రవీందర్ రెండేళ్ల క్రితం రూ.18 లక్షల వ్యయంతో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. కానీ ఈ భవనంతో పట్టుమని పది కార్యక్రమాలు కూడా జరగలేదు. చేసే కార్యక్రమాలు ఆర్ట్స్ కాలేజీ ఎదుట అయితే మీడియా ద్వారా గుర్తింపు వస్తుందని విద్యార్థులు జన్మదిన వేడుకలతో మొదలు ప్రతి కార్యక్రమాన్ని కళాశాల వేదికగా నిర్వహిస్తున్నారు. దీంతో డిస్కోర్స్ సెంటర్ భవనం వృథాగా దర్శనమిస్తోంది. ఈ భవనాన్ని ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని విద్యార్థి నేతలు పేర్కొన్నారు.